సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శనివారం, 9, నవంబర్, 2024



కన్నీటి వాగు


ఏలేశ్వరం మండలం తూర్పు లక్ష్మీపురానికి చెందిన నలుగురు అడ్డతీగల మండలం బొంగరాలపాడు వద్ద ఏలేరు కాలువలో గల్లంతయ్యారు. ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. - 8లో ▸



రూ.1,00,116 విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి బాలాజీ ట్రాన్స్‌పోర్టర్స్ అండ్ హ్యాండ్లర్స్ అధినేత బాలసుబ్రహ్మణ్యం (విశాఖపట్నం) శుక్రవారం రూ.1,00,116 విరాళం సమర్పించారు.

సముద్రంలోకి మిగులు జలాలు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి 60,437 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను శుక్రవారం సముద్రంలోకి విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.30 అడుగులుగా నమోదైంది. తూర్పు డెల్టాకు 1,100, సెంట్రల్ వెయ్యి, పశ్చిమ డెల్టాకు 3,500 కలిపి మొత్తం 5,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

హరిత సీమలో మరో హైవే

- పేరూరు వై జంక్షన్ నుంచి... రావులపాలెం వరకు నిర్మాణం
- 216 నుంచి 216ఏ మధ్య... అనుసంధానంగా మార్గం
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి ఫలితం
- 2022లో డీపీఆర్ అందజేసిన ప్రభుత్వం
- రూ.400 కోట్లతో పనులు
- 11 నుంచి భూ సర్వే



నూతన హైవేను కలిసే ఈదరపల్లి-ముక్కామల రహదారి



కొత్తపేట నుంచి పలివెల, రావులపాడు మీదుగా వెళ్లే రహదారి

సాక్షి, అమలాపురం: కోనసీమ జిల్లాలో మరో కీలక రహదారి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. జిల్లాలో ఉన్న రెండు జాతీయ రహదారులను అనుసంధానిస్తూ మరో జాతీయ రహదారి నిర్మాణానికి సిద్ధమైంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన కృషి ఫలితంగా అనుసంధాన రహదారి కల సాకారమవుతోంది. సువిశాలమైన రహదారులపై అటూ ఇటూ పచ్చని కొబ్బరి చెట్లు.. పిల్ల కాలువలు.. వరి సిరుల పైర్ల నడుమ ప్రయాణం మరింత హృద్యంగా.. ఉల్లాసంగా.. అలసట తెలియకుండా రైరైయ్యన వాహనాలు పరుగిడనున్నాయి.

కోనసీమ జిల్లా మీదుగా రెండు జాతీయ రహదారులు వెళ్తున్నాయి. దీనిలో ఒకటి కాకినాడ జిల్లా కత్తిపూడి నుంచి ప్రకాశం జిల్లా ఒంగోలు వరకు 216 జాతీయ రహదారి. ఇది జిల్లాలో ఐ.పోలవరం మండలం ఎదుర్లంక నుంచి మొదలై ముమ్మిడివరం, అమలాపురం, శివకోడు మీదుగా దిండి-చించినాడ వంతెన వద్ద పశ్చిమ గోదావరి జిల్లాలో కలుస్తోంది. రెండవది కోల్‌కతా-చెన్నై జాతీయ రహదారి 216ఏ (గతంలో ఇది ఎన్‌హెచ్ 16గా ఉండేది). గుండుగొలను-దివాన్‌చెరువు వద్ద ఆరు వరుసల రోడ్డు రావడంతో రాజమహేంద్రవరం, రావులపాలెం, తణుకు, తాడేపల్లిగూడెం మీదుగా సాగే ఎన్‌హెచ్ 16ను ఎన్‌హెచ్ 216 ఏగా మార్చారు. ఇది జిల్లాలో ఆలమూరు మండలం మడికి నుంచి రావులపాలెం మండలం మీదుగా సిద్ధాంతం వద్ద పశ్చిమ గోదావరి జిల్లాలో కలుస్తోంది.

ఈ రెండు జాతీయ రహదారుల మధ్య అనుసంధాన రహదారికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ రహదారి నిర్మాణం వల్ల కోనసీమ ప్రాంతం గణనీయమైన ప్రగతి సాధిస్తుందని గుర్తించిన నాటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముందు చూపుతో కేంద్ర ఉపరితల రవాణా శాఖకు ప్రతిపాదనలు పంపింది. రాష్ట్ర మాజీ మంత్రి పినిపే విశ్వరూప్, అమలాపురం మాజీ ఎంపీ చింతా అనూరాధ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం.. స్వయంగా కేంద్ర ఉపరితల రవాణా శాఖమంత్రి నితిన్ గడ్కరీని కలసి ఈ రహదారి ప్రాధాన్యతను వివరించడం, 2022లో డీపీఆర్ అందజేయడంతో ఈ ప్రణాళికకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రహదారి నిర్మాణం కోసం పంపిన ప్రతిపాదనలు.. రహదారి ఆవస్యకత... దీని వల్ల కలిగే ప్రయోజనాలు.. రహదారి నిర్మాణానికి అవసరమైన భూసేకరణకు సిద్ధమవ్వడం వంటి పనులు శరవేగంగా పూర్తి చేయడంతో కేంద్రం అనుసంధాన రహదారికి పచ్చజెండా ఊపింది. ఈ రహదారి-216లో పేరూరు వై జంక్షన్ వద్ద ప్రారంభమై ఇందుపల్లి, ఈదరపల్లి, ముక్కామల, కొత్తపేట, పలివెల మీదుగా రావులపాలెం మార్కెట్ యార్డు సమీపంలో రావులపాడు వద్ద 216ఏలో కలవనుంది. రహదారి నిర్మాణానికి రూ.400 కోట్లు వ్యయమవుతుందని గుర్తించింది. 23 మీటర్ల వెడల్పున రహదారిని విస్తరించనున్నారు. రహదారి వెంబడి 5.8 కిలో మీటర్ల మేర గ్రీన్ ఫీల్డ్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఇంతలో ఎన్నికలు రావడంతో అనుమతులు ఆలస్యమయ్యాయి.

ఆ ప్రాంతంలో కొత్త రహదారి

కొత్త జాతీయ రహదారి వెళ్లే పలు ప్రాంతాలు ఆర్ అండ్‌బీ పరిధిలో ఉన్నాయి. కాని పేరూరు వై జంక్షన్ నుంచి ఈదరపల్లి వంతెన వరకు మాత్రం కొత్తగా రహదారి నిర్మించాల్సి ఉన్నందున ఈ మార్గంలో పెద్ద ఎత్తున భూమి సేకరించాల్సి ఉంది. ఈదరపల్లి నుంచి ముక్కామల, కొత్తపేట మీదుగా మార్కెట్ యార్డు వరకు ఆర్‌అండ్‌బీ రహదారి ఉన్నందున భూసేకరణ పెద్దగా అవసరముండదని అంచనా. ఇప్పుడున్న ఈదరపల్లి-కొత్తపేట వరకు రహదారిని గత ప్రభుత్వం ఆధునీకరించింది. మొత్తం రహదారి బొబ్బర్లంక-అమలాపురం, అమలాపురం-అల్లవరం (బెండా కెనాల్)ను ఆనుకుని వెళ్లనుంది.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ప్రతిపాదనలతో..

గత ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం అనుసంధాన రహదారికి సిద్ధమవుతోంది. దీనిపై ఈ నెల 11వ తేదీ నుంచి సర్వే పనులు ప్రారంభించనుంది. పేరూరు వై జంక్షన్ వద్ద నుంచి ఇందుపల్లి బెండా కెనాల్ మీదుగా ఈదరపల్లి వంతెన.. అక్కడ నుంచి ముక్కామల, కొత్తపేట పలివెల వంతెన మీదుగా రావులపాలెం మార్కెట్ యార్డు (రావులపాడు) వద్ద జాతీయ రహదారిలో కలవనుంది. ఈ మేరకు ఈ ప్రాంతంలో సర్వే చేపట్టనున్నారు. ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ శాఖలతో పాటు జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు ఐదు మండలాల నుంచి సర్వేయర్లను నియమించనున్నారు. వీరితో పాటు జాతీయ రహదారుల అధికారులు తమ సాంకేతిక సిబ్బందిని ఈ సర్వేలో నియమించనున్నారు. రహదారి మార్గంలో ఇప్పుడున్న రహదారులు, వాటి వెడల్పు, చేపట్టాల్సిన భూసేకరణ, మొత్తం రహదారి నిర్మించాల్సిన ప్రాంతం, అందుకు అవసరమైన భూసేకరణపై సర్వే చేయనున్నారు. కావాల్సిన భూమి, గెయిల్ పైప్ లైన్ల గుర్తింపు, విద్యుత్ శాఖకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్లు, మంచినీటి పైప్‌లైన్లు గుర్తించి నివేదిక రూపొందించి ఎన్‌హెచ్ అధికారులకు అందించనున్నారు. అలాగే సర్వే ప్రక్రియలో రహదారి వెంబడి ప్రభుత్వ కట్టడాలు, ఆస్తులను గుర్తించి ఆయా శాఖల నుంచి అనుమతి పొందాల్సి ఉంది.

త్వరితగతిన సర్వే పూర్తి



జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన భూమిని గుర్తించడం, రహదారి వెళ్లే మార్గంలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తుల గుర్తింపునకు ఈ నెల 11 నుంచి సర్వే మొదలు పెట్టనున్నాం. రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ, భూ సర్వే విభాగంతో పాటు ఎన్‌హెచ్ సాంకేతిక సిబ్బంది ఈ సర్వేలో పాల్గొననున్నారు. త్వరితగతిన సర్వే పూర్తి చేయాల్సిందిగా అధికారులను ఆదేశించాము.

– టి.నిశాంతి, జాయింట్ కలెక్టర్

న్యూస్‌రీల్

ఊబలంకలో ఇసుక అక్రమ తవ్వకాలు

- టెండర్ ఖరారు కాకుండానే దోపిడీ
- 'సాక్షి' ఫిర్యాదుతో అడ్డుకున్న అధికారులు



ఊబలంక ఇసుక ర్యాంపులో శుక్రవారం జరుగుతున్న ఇసుక తవ్వకాలు

రావులపాలెం: జిల్లా సాండ్ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ 12 ఇసుక ర్యాంపులకు బిడ్ పిలిచిన విషయం తెలిసిందే. ఈ ప్రక్రియ పూర్తి కాకుండానే ర్యాంపు దక్కించుకున్న పాటదారుడు ఎవరో తెలియకుండానే మండలం ఊబలంక ఇసుక ర్యాంపులో టీడీపీ నాయకులు తవ్వకాలు మొదలు పెట్టారు. టెండరుదారులు ఖరారయ్యేలోపు అందిన కాడికి దోచుకోవాలన్న లక్ష్యంతో టీడీపీ నాయకులు ర్యాంపులో బాటలు వేసి శుక్రవారం కూలీలతో తవ్వకాలను ప్రారంభించారు. ట్రాక్టర్ ఇసుకకు రూ.500 వసూలు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఇసుక అక్రమ తవ్వకాల విషయాన్ని 'సాక్షి' కొత్తపేట ఆర్డీఓ దృష్టికి తీసుకువెళ్లడంతో సాయంత్రానికి రెవెన్యూ అధికారులు తవ్వకాలను అడ్డుకుని నిలిపివేశారు.

జాతీయ గణిత సదస్సుకు డాక్టర్ మూర్తి పరిశోధన పత్రం



అమలాపురం టౌన్: జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో రామానుజన్ జయంతి సందర్భంగా న్యూఢిల్లీలో నిర్వహించనున్న జాతీయ గణిత సదస్సులో అమలాపురానికి చెందిన గణితావధాని డాక్టర్ టీఎస్‌వీఎస్ సూర్యనారాయణమూర్తి పరిశోధన పత్రం సమర్పించనున్నారు. రామానుజన్ జయంతిని పురస్కరించుకుని డిసెంబర్ 22 జరగనున్న సదస్సులో పత్రం సమర్పణకు ఎస్‌సీఈఆర్టీ నుంచి డాక్టర్ మూర్తికి శుక్రవారం సమాచారం అందింది. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడైన డాక్టర్ మూర్తి విజయవాడ కేబీఎన్ కళాశాలకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ జి.సీతారత్నంతో కలిసి ఈ పరిశోధన పత్రాన్ని రూపొందించారు. ఆయన ఇప్పటి వరకూ ఎస్సీఈఆర్టీ నుంచి మూడు సార్లు జాతీయ స్థాయి అవార్డులు, ప్రశంసా పత్రాలు అందుకున్నారు. పాఠశాల హెచ్‌ఎం ఎస్.రాజరాజేశ్వరి, ఉపాధ్యాయులు డాక్టర్ మూర్తిని అభినందించారు.

ఐపీపీబీ ఖాతాలు తెరుచుకోండి

పోస్టల్ సూపరింటెండెంట్ నవీన్‌కుమార్



అమలాపురం టౌన్: వార్డు, గ్రామ సచివాలయాల పరిధిలో ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంక్ (ఐపీపీబీ) ఖాతాలు తెరుచుకునేలా ప్రజలకు వెసులుబాటు కల్పిస్తున్నట్టు స్థానిక పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ ఆర్.నవీన్ కుమార్ తెలిపారు. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) యాక్టివేషన్ కోసం ఈనెల 15వ తేదీ వరకూ ఆయా సచివాలయాల వద్ద ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ సామాజిక ప్రయోజనాలు పొందేందుకు నిర్దేశించిన డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) లబ్ధిదారుల బ్యాంక్, పోస్టల్ ఖాతాలకు ఎన్‌పీసీఐ లింక్‌ను యాక్టివ్ చేయంచుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. డివిజన్ పరిధిలో సుమారు 1.5 లక్షల మందికి ఎన్‌పీసీఐ మ్యాపింగ్‌లో ఆధార్ అనుసంధానం కాకపోవడం వల్ల సంక్షేమ పథకాలు అందడం లేదని తెలిపారు. ఎన్‌పీసీఐ యాక్టివేషన్‌కు ఐపీపీబీ ఖాతాతో చేయించుకోవాలని సూచించారు. ఖాతా లేని వారు ఆధార్ నెంబరుతో సమీపంలోని పోస్టాఫీస్‌లో ఐపీపీబీ ఖాతా తెరిచి యాక్టివేట్ చేయించుకోవచ్చునని తెలిపారు. ఇందు కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నవీన్‌కుమార్ విజ్ఞప్తి చేశారు.

ఆర్టీసీ ఈయూ జిల్లా నూతన కార్యవర్గం

అమలాపురం రూరల్: ఏపీ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ ఎంప్లాయీస్ యూనియన్ (ఏపీ పీటీడీ ఈయూ) జిల్లా నిర్మాణ మహాసభ అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షుడిగా రావుల సుబ్బారావు, అధ్యక్షుడిగా పి.సత్తిబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎండీ రజాక్, జిల్లా కార్యదర్శిగా మేడిది శ్రీనివాసరావుతో పాటు ఎనిమిది మంది ఉపాధ్యక్షులను, ఆర్గనైజింగ్ కార్యదర్శి, కోశాధికారి, సహాయ కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, డెప్యూటీ జనరల్ సెక్రటరీ ఎండీ ప్రసాద్, విజయవాడ జోన్-2 కార్యదర్శి వై.శ్రీనివాసరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఇసుక టెండర్ల మూల్యాంకనం

కలెక్టర్ మహేష్ కుమార్



ఇసుక బిడ్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: జిల్లాలోని ఇసుక రీచ్‌లకు సంబంధించి ఆహ్వానించిన టెండర్ల మూల్యాంకనంలో పారదర్శకంగా వ్యవహరించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో బిడ్‌ల మూల్యాంకన కమిటీతో ఆయన సమావేశమై సభ్యులకు దిశానిర్దేశం చేశారు. కమిటీలో ఆడిట్, డ్వామా పీడీ, గనులు, ఆర్ అండ్ బి, ఇరిగేషన్, రిజిస్ట్రేషన్లు, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల జిల్లా అధికారులు ఏడుగురు సభ్యులుగా ఉన్నారన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆత్రేయపురం మండలంలో అంకంపాలెం, నార్కేడిమిల్లి, పులిదిండి, వద్దిపర్రు-1, వద్దిపర్రు-2, ఆత్రేయపురం, రావులపాలెం మండలంలో పొడగట్లపల్లి-1, పొడగట్లపల్లి-2, ఊబలంక, ఆలమూరు మండలంలో ఆలమూరు, కపిలేశ్వరపురం మండలంలో కపిలేశ్వరపురం, తాతపూడి మొత్తంగా 12 ఇసుక రీచ్‌లలో 2025 మార్చి 14 వరకు ఇసుక తవ్వడం, లోడింగ్, నిల్వకేంద్రం వద్దకు రవాణా తదితర అంశాలపై ఆహ్వానించిన టెండర్లలో 59 దరఖాస్తులు వచ్చాయని, వాటి అర్హతలను కమిటీ పర్యవేక్షించి 12వ తేదీ నాటికి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అతి తక్కువగా కోట్ చేసిన వారికి రీచ్‌ల నిర్వహణకు అనుమతులు ఇస్తామని పేర్కొన్నారు. అనంతరం ఆయన టెక్నికల్ బిడ్లను పరిశీలించారు.

వంతెన పనులను వేగవంతం చేయాలి

పి.గన్నవరం: ఊడిమూడి లంక, జి.పెదపూడి లంక గ్రామాల ప్రజల కోసం వశిష్ట నదీపాయపై రూ.49.5 కోట్లతో నిర్మిస్తున్న వంతెన పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశించారు. ఈవంతెన పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. అప్రోచ్ కోసం తమ నుంచి తీసుకున్న 4.32 ఎకరాల భూమికి ఇవ్వాల్సిన రూ.2.5 కోట్లను విడుదల చేయాలని రైతులు కలెక్టర్‌ను కోరారు. వంతెన నిర్మాణం కోసం అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని, పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.శ్రీపల్లవి, ఎంపీడీఓ కేవీ ప్రసాద్, ఏఈ కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

మెనూ మావల్ల కాదు!

- ధరలకు అనుగుణంగా పెరగని కుకింగ్ చార్జీలు
- వినతులకు, డిమాండ్లకు స్పందించని సర్కారు
- మెనూ మేరకు నిధులు ఇవ్వాలంటున్న ఏజెన్సీలు



మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

ప్రస్తుతం భోజనం మెనూ..

- ▸▸ సోమవారం – వెజిటబుల్ పలావ్, బంగాళాదుంప కర్రీ, ఉడికించిన గుడ్డు, చిక్కీ.
- ▸▸ మంగళవారం – చింతపండుతో చేసిన పులిహోర, దొండకాయ పచ్చడి, ఉడికించిన గుడ్డు, రాగి జావ.
- ▸▸ బుధవారం – కూరగాయల అన్నం, బంగాళాదుంప కూర, చిక్కీ, ఉడికించిన గుడ్డు.
- ▸▸ గురువారం – నిమ్మకాయతో పులిహోర, టమాటా చట్నీ, ఉడికించిన గుడ్డు, రాగిజావ.
- ▸▸ శుక్రవారం – అన్నం, ఆకుకూరతో పప్పు, ఉడికించిన గుడ్డు, చిక్కీ.
- ▸▸ శనివారం – ఆకుకూరతో అన్నం, కూరగాయల దాల్, స్వీట్, రాగి జావ.

రాయవరం: రుచికరమైన.. పౌష్టిక విలువలతో భోజనం పెట్టి పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్నీ.. బడి ఈడు పిల్లలు చదువులకే వెళ్లాలన్న ప్రభుత్వ ఆశయాన్ని.. తద్వారా ఆరోగ్యవంతమైన రేపటి పౌరులను తయారు చేయడం ప్రభుత్వ లక్ష్యాలలో ఒకటి. అంత బృహత్తరమైన లక్ష్యాన్ని సాధించాలంటే ప్రభుత్వమే తగినన్ని వనరులు సమకూర్చాల్సిన ఆవశ్యకత ఉంది. ఏదో అమలు చేసేస్తున్నాం అన్నట్టు కాకుండా లక్ష్య శుద్ధి కూడా ఎంతో అవసరం. ప్రస్తుత పరిస్థితుల్లో కూరగాయల ధరలతో పాటు నిత్యావసర వస్తువులు సైతం పోటీ పడుతున్నాయి. అటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వం ఇచ్చే అరకొర చెల్లింపులతో నాణ్యమైన పౌష్టికాహారాన్ని ఏ నిర్వాహకులైన ఎలా పెట్టగలరో పాలకులే ఆలోచించాలి. ఏళ్ల తరబడి కుకింగ్ చార్జీలు పెంచాలని నిర్వాహక ఏజెన్సీలు మొరపెట్టుకుంటున్నా ప్రభుత్వం నుంచి ఉలుకూ పలుకూ ఉండడం లేదు. మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న ఏజెన్సీలకు పెరిగిన నిత్యావసర వస్తువుల ధరల్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం మెనూ చార్జీల చెల్లింపులను పెంచాల్సి ఉంటుంది. పాఠశాలలు పునఃప్రారంభమై నాలుగు నెలలు గడుస్తున్నా నేటికీ మధ్యాహ్న భోజన పథకంలో మెనూ చార్జీలపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. విద్యార్థులకు పౌష్టికాహారం సమగ్రంగా, సమర్థవంతంగా అందించాలంటే కుకింగ్ చార్జీలు పెంచాల్సిన అవసరం ఉందనేది నిర్వివాదాంశం.

పెరిగిన ధరలు ఇలా..

ఇటీవల కాలంలో నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఏ కాయగూర కొందామన్నా కేజీ రూ.40 పైనే పలుకుతోంది. దీనికి తోడు ఆయిల్ ధరలు, నిత్యావసర వస్తువుల ధరలు, గ్యాస్ ధర ఆకాశాన్నంటుతున్నాయి. ఈ ధరలతో ప్రభుత్వ లక్ష్యాలను ఎలా సాధించాలని నిర్వాహకులు ప్రశ్నిస్తున్నారు. మధ్యాహ్న భోజన పథకంలో వారానికి ఐదు రోజులు కోడిగుడ్డు ఇస్తున్నారు. పెరిగిన కూరగాయల ధరలు, నిత్యావసర వస్తువుల ధరలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకంలో కుకింగ్ చార్జీలను కూడా రూపాయల్లోనే పెంచాలని ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీలు డిమాండ్ చేస్తున్నాయి. అలాగే మధ్యాహ్న భోజన పథకంలో గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇవ్వాలని, అప్పుడే నాణ్యమైన భోజనాన్ని అందించగలమని ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీల నిర్వాహకులు చెబుతున్నారు.

జిల్లాలో పరిస్థితి ఇదీ

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 1,570 పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలవుతోంది. ఈ పాఠశాలల్లో 2,589 మంది కుక్ కమ్ హెల్పర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. 95,315 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజన పథకంలో లబ్ధిపొందుతున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఒక్కో విద్యార్థికి 100 గ్రాములు, ఉన్నత పాఠశాలల్లో ఆరు నుంచి 10వ తరగతి వరకు ఒక్కో విద్యార్థికి 150 గ్రాముల బియ్యాన్ని అందజేస్తారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థికి ఇప్పటి వరకు రూ.5.88 పైసలు చెల్లిస్తుండగా, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల స్థాయిలో ఒక్కో విద్యార్థికి రూ.8.57 పైసలు చెల్లిస్తున్నారు. జిల్లాలో అత్యధిక పాఠశాలల్లో ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీలు విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని వండి వడ్డిస్తుండగా, కొన్ని మండలాల్లో ట్రస్టులు ఆహారాన్ని తయారు చేసి విద్యార్థులకు సరఫరా చేస్తున్నాయి. అనపర్తి మండలం పొలమూరులో బుద్దవరపు ఛారిటబుల్ ట్రస్ట్ విద్యార్థులకు ఆహారాన్ని తయారు చేసి సరఫరా చేస్తోంది.

కుకింగ్ చార్జీలు పెంచాలి



మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలంటే కుకింగ్ చార్జీలను తప్పనిసరిగా పెంచాల్సిన అవసరం ఉంది. ప్రాథమిక పాఠశాలల పరిధిలో ఒక్కో విద్యార్థికి రూ.8, ప్రాథమికోన్నత పాఠశాలల పరిధిలో ఒక్కో విద్యార్థికి రూ.15 ఇవ్వాలి. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.

– పెంకే వెంకటేశ్వరరావు, యూటీఎఫ్ శాఖ జిల్లా అధ్యక్షుడు, అమలాపురం

నాణ్యమైన భోజనం ఎలా సాధ్యం



నిత్యావసర వస్తువుల ధరలు రూపాయల్లో పెరుగుతుంటే మధ్యాహ్న భోజన పథకంలో కుకింగ్ చార్జీలు పైసల్లో పెంచుతున్నారు. ఇలా అయితే నాణ్యమైన భోజనం ఎలా సాధ్యమవుతుంది. ఏ విధంగా చూసినా విధానం సమంజసంగా లేదు. ఎప్పటికప్పుడు ధరలసూచీకి అనుగుణంగా కుకింగ్ చార్జీలు పెంచాలి.

– పోతంశెట్టి దొరబాబు, ఎస్టీయూ జిల్లా శాఖ అధ్యక్షుడు, అమలాపురం

ప్రభుత్వం పునరాలోచించాలి



ప్రభుత్వం కుకింగ్ చార్జీలపై పునరాలోచించాలి. పాఠశాలలు పునః ప్రారంభించి దాదాపు ఐదు నెలలు కావస్తోంది. ఇప్పటి వరకు కుకింగ్ చార్జీలు పెంచక పోవడం దారుణం. పేద విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం ఇప్పుడున్న కుకింగ్ చార్జీలను ప్రస్తుతం ఉన్న ధరలతో పోలిస్తే కష్ట సాధ్యం.

– దీపాటి సురేష్‌బాబు, పీఆర్‌టీయూ జిల్లా శాఖ అధ్యక్షులు, పీఆర్‌టీయూ

కలెక్టర్‌కు అభ్యర్థుల అభినందన



కలెక్టర్ మహేష్‌కుమార్‌కు పూలమొక్క ఇచ్చి అభినందిస్తున్న అభ్యర్థులు

అమలాపురం రూరల్: వికాస సంస్థ ఆధ్వర్యంలో ది అమలాపురం కళాశాలలో ఇటీవల జరిగిన ఉద్యోగ మేళాలో పానాసోనిక్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్‌ను కలుసుకున్నారు. సోమవారం ఉద్యోగంలో చేరనున్న అభ్యర్థులు శుక్రవారం ఆయనను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చా రావు, జిల్లా మేనేజర్ గోళ్ళ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రత్నగిరిపై భక్తుల రద్దీ

అన్నవరం: వేలాదిగా తరలివచ్చిన భక్తులతో రత్నగిరి శుక్రవారం కిటకిటలాడింది. సత్యదేవుని ఆలయ ప్రాంగణం, వ్రత మండపాలు, విశ్రాంతి మండపాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. సుమారు 30 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ భక్తుల రద్దీ కొనసాగింది. దీంతో స్వామివారి వ్రత మండపాలతో పాటు నిత్య కల్యాణ మండపంలో సైతం వ్రతాలు నిర్వహించారు.

అట్రాసిటీ కేసులలో సాక్ష్యమే కీలకం

సీఐడీ ఏఎస్పీ అస్మ ఫర్హీన్



సదస్సులో మాట్లాడుతున్న సీఐడీ ఏఎస్పీ అస్మ ఫర్హీన్

అమలాపురం టౌన్: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో సాక్ష్యమే కీలకమని, తద్వారా త్వరితగతిన శిక్షలు పడతాయని జిల్లా నేర పరిశోధన విభాగం (సీఐడీ) ఏఎస్పీ అస్మ ఫర్హీన్ అన్నారు. అమలాపురంలోని గంగరాజు ఫంక్షన్ హాలులో రాజమహేంద్రవరం సీఐడీ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో అట్రాసిటీ కేసులపై శుక్రవారం జరిగిన అవగాహన సదస్సుకు ఫర్హీన్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లాల్లో ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న నేరాలు, వాటి నుంచి చట్టరీత్యా బాధితులకు రక్షణ, న్యాయం పొందడంపై ఆమె అవగాహన కల్పించారు. రాజమహేంద్రవరం సీఐడీ డీఎస్పీ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగన ఈ అవగాహన సదస్సులో స్థానిక డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ మాట్లాడుతూ అట్రాసిటీ కేసులపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. విశ్రాంత పీపీ కొర్లపాటి గోపాలరావు పౌర హక్కుల గురించి అవగాహన కల్పించారు. మరో విశ్రాంత పీపీ ఐఎస్ మల్లేశ్వరరావు, అమలాపురం తహసీల్దార్ జీడీ కిషోర్ బాబు, దళిత మహిళా శక్తి జాతీయ కన్వీనర్ కె.రాజామణి, దళిత బహుజన శ్రామిక యూనియన్ సెక్రటరీ శేషావతారం సదస్సులో వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.

క్లుప్తంగా

విద్యార్థులను నిపుణులుగా చేయడమే లక్ష్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న చైతన్యరాజు

రాజానగరం: నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు విద్యార్థులకు అందిస్తూ, వారిని ప్రపంచంలో తిరుగులేని నిపుణులుగా తయారు చేయడమే తమ ప్రధాన లక్ష్యమని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) అన్నారు. జెనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, చాట్ జీపీటీలతో కలసి అనువర్తనాలపై జీజీయూ శుక్రవారం జాతీయ స్థాయి కార్యక్రమం నిర్వహించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రభావాన్ని ప్రొ. చాన్సలర్ కె.శశికిరణ్‌వర్మ వివరించారు. సాంకేతిక పరిజ్ఞాన్ని పెంపొందించుకోవడంలో ఏఐ టూల్స్ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. సాంకేతిక విద్యలో ఏఐ విప్లవాత్మక మార్పులను బెంగళూరుకు చెందిన కరిష్మా కార్పొరేషన్ చైర్మన్, సీఈఓ, ఇండో - అమెరికన్ చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ రాజ్ మృత్యుంజయప్ప వివరించారు. ఆటో మొబైల్ రంగంలో ఏఐ అన్వయాలు, వినియోగాల గురించి కాంటినెంటల్ ఇండియా ప్రెసిడెంట్, సీఈఓ ప్రశాంత్ దొరస్వామి తెలియజేశారు. జీజీయూ వీసీ యు.చంద్రశేఖర్ ఆధ్వర్యాన ప్యానల్ డిస్కషన్ నిర్వహించారు. ఏఎంఎస్ ఇండియా సీఈఓ ఎన్‌సీ శశిధర్ కూడా ప్రసంగించారు. కార్యక్రమానికి బి.సుజాత, ఆర్.తమళకోడి, కె.వల్లీ మాధవి కన్వీనర్లుగా వ్యవహరించారు.

వివాహిత ఆత్మహత్య

జగ్గంపేట: భర్త సినిమాకి తీసుకువెళ్లలేదని అలిగి రెండు రోజులు క్రితం అదృశ్యమైన వివాహిత జగ్గంపేటలోని పోలవరం కాలవలో శవమైతేలింది. సీఐ వైఆర్‌కే శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం జగ్గంపేట సత్యవేణిపేటకు చెందిన వెలుగుల వీర దుర్గాప్రసాద్ భార్య ఏసమ్మ (22) రెండు రోజుల క్రితం నుంచి కనిపించడంలేదని తెలిపారు. ప్రతి చిన్న విషయానికి కోపగించే ఏసమ్మ ఈ నెల 6వ తేదీన భర్తను సినిమాకి తీసుకుని వెళ్లమనగా అతడు నిరాకరించడంతో అలిగి ఎటో వెళ్లిపోయింది. శుక్రవారం జగ్గంపేట డిగ్రీ కాలేజీ సమీపంలో పోలవరం కాలవలో మహిళ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఆ మృతదేహం ఏసమ్మదిగా ఆమె తల్లి, భర్త గుర్తించారు. మృతురాలి తల్లి నక్కా వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, ఎస్సై రఘునాథరావు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసరావు వివరించారు.

కన్నీటి వాగు

- ఏలేరు కాలువలో నలుగురు గల్లంతు
- ఇసుక తవ్వకాలకు వెళ్లి మునక
- ఇద్దరి మృతదేహాలు లభ్యం
- మిగిలినవారి కోసం గాలిస్తున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు
- తూర్పు లక్ష్మీపురంలో విషాదఛాయలు


మిగిలినవారి కోసం గాలిస్తున్న ఎస్‌డీఆర్ ఎఫ్ బృందాలు

ఏలేశ్వరం: రోజూ తవ్వుకునే ఇసుకే తమను మింగేస్తుందని ఆ నలుగురికీ తెలియలేదు. ఎప్పుడూ తవ్వే చోటే మరింత ఇసుక తవ్వుకుని నాలుగు డబ్బులు సంపాదిద్దామనుకున్న వారి ఆశ పాశమై కిందకు లాగేసింది. ఇంకాస్త లోతుకు వెళ్లాలని వారు తీసుకువెళ్లిన ఓ స్టాండ్ వారిని నిలువనీయకుండా పైకి రానీయకుండా అడ్డుపడి ప్రాణాలకు ప్రమాదమై అడ్డుపడింది.

అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగల మండలం బొంగరాలపాడు వద్ద ఏలేరు కాలువలో ఇసుక తవ్వకానికి వెళ్లిన ఐదుగురిలో ఇద్దరు మృతి చెందగా ఇద్దరు గల్లంతయ్యారు. ఒకరు ఈ ప్రమాదం నుంచి బయటపడ్డారు. కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం తూర్పులక్ష్మీపురం గ్రామానికి చెందిన వీరమల్లు భూషణం (52), వీరమల్లు జయబాబు(25), చింతా శ్రీనివాస్ (16), చిన గొంతియ్య (30) బొంగరాలపాడు వద్ద ఇసుక తీసుకువచ్చేందుకు వెళ్లి ప్రమాదవశాత్తూ మునిగిపోయారు. భూషణం ఇటీవల ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. దళిత కుటుంబానికి చెందిన అతడు ఇసుక క్రయవిక్రయాలు చేస్తుంటాడు. రోజులాగే తన కుమారుడు జయబాబు, వరసకు అల్లుడయ్యే చిన గొంతియ్య, చింతా శ్రీనివాస్, మరో వ్యక్తి శామ్యూల్‌తో కలిసి ఇసుక తెచ్చేందుకు అతడి ట్రాక్టర్‌తో బొంగరాలపాడు వెళ్లారు. అక్కడ నడుము లోతు గోతిలో ఒక స్టాండ్ సాయంతో మరింత ఇసుక తవ్వేందుకు ప్రయత్నిస్తుండగా భూషణం మునిగిపోయాడు. అతన్ని రక్షించేందుకు పక్కనే ఉన్న జయబాబు, వారిని రక్షించేందుకు గొంతియ్య, చింతా శ్రీను ప్రయత్నించారు. మొత్తం నలుగురు మునిగిపోయి గల్లంతయ్యారు. దీంతో శామ్యూల్ ఆందోళనతో ఒడ్డుకు వచ్చేశాడు. ఈ ఘటనను గమనించిన పక్కనే చేపలు పడుతున్న మత్స్యకారులు వెంటనే గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. డీఎస్పీ జి.సాయి ప్రశాంత్, సీఐ నరసింహమూర్తి, తహసీల్దార్ శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు గాలింపు చేపట్టాయి. వీరమాల జయబాబు, చిన గొంతియ్య మృతదేహాలు దొరకడంతో వాటిని పోస్టుమార్టం నిమిత్తం నిమిత్తం అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మిగతా ఇద్దరి ఆచూకీ కోసం 31 మందితో కూడిన ఎస్డీఆర్‌ఎఫ్ బృందాలు గాలింపు కొనసాగిస్తున్నాయి. ప్రమాద సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు సంఘటన స్థలానికి చేరుకుని రోదిస్తున్నారు.


ఘటన స్థలంలో రోదిస్తున్న మృతుల బంధువులు


వీరమల్లు భూషణం మృతదేహం

భర్తను, బిడ్డను కోల్పోయి..

భర్త భూషణం, కుమారుడు జయబాబును కోల్పోయిన వీరమల్లు లక్ష్మి రోదన వర్ణనాతీతం. ఇంటి పెద్దతో పాటు, అందివచ్చిన కొడుకు గల్లంతయ్యారన్న వార్తతో ఆ కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

ఇంటికి పెద్ద కుమారుడు

చింతా గోపి, సత్యవతిలకు ముగ్గురు సంతానం కాగా శ్రీనివాస్ పెద్దవాడు. కుటుంబానికి పెద్దవాడవడంతో కూలీ పనులు చేస్తూ ఆసరాగా నిలుస్తున్నాడు. అతడు గల్లంతవడంతో ఆ కుటుంబం తీవ్ర ఆందోళనకు గురవుతోంది.

బంధువుల ఇంటికి వచ్చి..

కూలీ పనుల నిమిత్తం బంధువుల ఇంటికి వచ్చి తూర్పు లక్ష్మీపురంలో ఉంటున్నాడు చినగొంతియ్య. భూషణానికి బంధువు కావడంతో ఇక్కడకు వచ్చి కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. పని కోసం వచ్చి గల్లంతవడంతో అతని కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.

కొనసాగిన సిమ్యుల్కాన్

డాక్టర్ గన్నికి జీవన సాఫల్య పురస్కారం



జీవిత సాఫల్య పురస్కారాన్ని అందుకుంటున్న డాక్టర్ గన్ని భాస్కరరావు

రాజానగరం: వైద్య విద్య బోధనకు, ఆస్పత్రులలో చికిత్సలకు మధ్య అంతరాన్ని తగ్గించడంలో సిమ్యులేషన్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం అన్నారు. స్థానిక జీఎస్‌ఎల్ వైద్య కళాశాలలో హెల్త్ కేర్ సిమ్యులేసన్ సొసైటీ (ఎస్‌హెచ్‌ఎస్) ఆధ్వర్యంలో 6వ వార్షిక హెల్త్‌కేర్ సిమ్యులేషన్ కాన్ఫరెన్స్, సిముల్కాన్ 2024 శుక్రవారం రెండో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా జీఎస్‌ఎల్ వైద్య కళాశాల వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావుకు సొసైటీ ప్యాట్రన్, జీవిత సాఫల్య పురస్కారాలను అందించారు. సిమ్యులేషన్‌లో విశిష్ట సేవలు అందించిన డాక్టర్ దినకర్‌పాయ్‌ను నిర్వాహకులు సత్కరించారు.

భర్త కోసం మహిళ మౌన పోరాటం

- మరొకరితో సహజీవనం చేస్తున్నాడని ఆరోపణ
- అధికారులు స్పందించి న్యాయం చేయాలని వినతి


మౌన పోరాటం చేస్తున్న బాధితురాలు

పిఠాపురం: తన భర్త తనకు కావాలంటూ ఇద్దరు చిన్న పిల్లలతో కలిసి భర్త ఇంటి ఎదుట ఓ మహిళ శుక్రవారం పట్టణంలో మౌన పోరాటానికి దిగింది. మహిళ తల్లిదండ్రులు పెంకె త్రిమూర్తులు, సరస్వతి తెలిపిన వివరాల మేరకు తమ కుమార్తె సౌమ్య లక్ష్మికి 2017 మార్చి ఐదో తేదీన రాజమహేంద్రవరం లలితా నగర్‌కు చెందిన విత్తనాల రామలక్ష్మణ్ కుమార్‌తో అన్నవరంలో వివాహమైంది. వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారని, పెళ్లయిన నాటి నుండి భర్త, అత్తింటి వారు తీవ్ర వేధింపులకు గురి చేస్తూ వచ్చారని తెలిపారు. వరకట్న వేధింపులపై స్థానిక అంగర పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసి కేసు పెట్టామని తెలిపారు. అయినప్పటికీ పిల్లలకు, తనకు అన్యాయం చేయవద్దని కలిసి ఉందామని తమ కుమార్తె ఎంత వేడుకున్నా తమ అల్లుడు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంతే కాకుండా వేరే మహిళతో సహజీవనం చేస్తున్నాడని పేర్కొన్నారు. తమ కుమార్తె మనవరాళ్లు, అల్లుడు కలిసి జీవించాలని తాము కోరుకుంటున్నామని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను వేడుకుంటున్నామని అన్నారు. కాగా మౌన పోరాటం చేస్తున్న మహిళకు కాకినాడ టీడీపీ మహిళా అధ్యక్షురాలు సత్యభామ, జనసేన వీర మహిళ వెంకటలక్ష్మి, ఐద్వా పిఠాపురం పట్టణ అధ్యక్షురాలు కుంచే మణి తదితరులు సంఘీభావం తెలిపారు.

పలు చోరీ కేసులలో వ్యక్తి అరెస్టు

- రూ.5 లక్షల విలువైన బంగారు, వెండి వస్తువుల స్వాధీనం


తూరంగిలో చోరీకి సంబంధించి స్వాధీనం చేసుకున్న సొత్తును చూపిస్తున్న సీఐ చైతన్య కృష్ణ, ఎస్సై వీరబాబు తదితరులు

కాకినాడ రూరల్: తూరంగి గ్రామంలో తాళం వేసిన ఇల్లు కనిపిస్తే చోరీకి పాల్పడే పాత నేరస్తుడు బత్తిన లక్ష్మణరావును ఇంద్రపాలెం పోలీసులు గురువారం అరెస్టు చేశారు. కాకినాడ జగన్నాథపురం కోమలవారి వీధికి చెందిన అతడి అరెస్టుపై ఇంద్రపాలెం పోలీసు స్టేషన్‌లో సీఐ చైతన్యకృష్ణ, ఎస్సై ఎం.వీరబాబు శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. తూరంగి గ్రామంలో ఏప్రిల్ నెలలో ఒక ఇంట్లో, గత నెలాఖరున మరో ఇంట్లో జరిగిన చోరీలపై పోలీసు కేసు నమోదైంది. దర్యాప్తు అనంతరం పాత నేరస్తుడు లక్ష్మణరావును తూరంగి బాలయోగి సెంటరు వద్ద గురువారం మధ్యాహ్నం అరెస్టు చేసి అతడి నుంచి చోరీ సొత్తు రూ.5 లక్షల విలువైన 59 గ్రాముల బంగారు, 1189 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. లక్ష్మణరావుపై అనకాపల్లి టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో 7, సబ్బవరం, కోటనందూరు పోలీసు స్టేషన్ల పరిధిలో ఒక్కొక్కటి కలిపి 9 కేసులు నమోదైనట్టు సీఐ చైతన్య కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇళ్లు వదిలి బయటకు వెళ్లే సమయంలో తాళం కప్పలు బయటకు కనపడకుండా జాగ్రత్త పడాలని, ఊరికి దూరంగా జనావాసాలు లేని ప్రాంతాల్లోని ఇళ్ల వారు సీసీ కెమెరాలు తప్పక ఏర్పాటు చేసుకోవాలన్నారు. మోటారు సైకిల్‌కు హ్యాండిల్ లాక్‌తో పాటు వీల్ లాక్ వేసుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు ఎస్సై ప్రసాద్, క్రైమ్ హెచ్‌సీ ప్రసాద్, క్రైమ్ పీసీ అప్పారావు పాల్గొన్నారు.

తెలుగు వైభవాన్ని పునరుద్ధరించుకుందాం



పుస్తకావిష్కరణ చేస్తున్న మంత్రి దుర్గేష్

రాజానగరం: చారిత్రక ప్రసిద్ధి చెందిన ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవాన్ని పునరుద్ధరించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినీమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ, కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్, ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతిక సమితి, విజయవాడలోని సెంటర్ ఫర్ ఏపీ స్టడీస్ (కాప్స్) సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన 'ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవం' సదస్సు శుక్రవారం ముగిసింది. సభలో మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ ఆదికవి నన్నయ, టంగుటూరి ప్రకాశం పంతులు, కందుకూరి వీరేశలింగం వంటి ఎందరో మహనీయులు నడియాడిన ఈ నేలపై సాంస్కృతిక వైభవాన్ని పెంపొందించే దిశగా ఇటువంటి సదస్సులు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రాచీనమైన తెలుగుభాషకు సంబంధించి లిఖితపూర్వక ఆధారాలను భద్రపర్చుకోవలసిన అవసరం ఉందన్నారు. తెలుగు వారికి మాత్రమే ఉన్న గొప్ప సాహిత్య రూపం - పద్య, పౌరాణిక నాటకాలన్నారు. రాష్ట్రంలోని ఎన్నో కళా రూపాలను ఆదరించాలని సూచించారు. ఈ సందర్భంగా 'వేదంలా ఘోషించే గోదావరి...' పాటకు కూచిపూడి నృత్య రీతిలో ప్రదర్శించిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య వై. శ్రీనివాసరావు మాట్లాడుతూ 'ఆదికవి నన్నయ' పేరుతో ఏర్పడిన యూనివర్సిటీలో విద్యార్థుల ఉన్నతిని ఆకాంక్షిస్తూ క్రమశిక్షణతో కూడిన బోధనను అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ తన నియోజకవర్గంలోని ఈ వర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఇదే కార్యక్రమంలో కాప్స్ ద్వారా రూపొందించిన 'ఆంధ్రప్రదేశ్ దిగ్దర్శనం', ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య శ్రీనివాసరావు రూపొందించిన 'జియాలాజికల్ మ్యాప్', ఆంధ్ర శక్తి ద్వారా రూపొందించిన 'ఈట్ టు ఫీడ్' పుస్తకాలను మంత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, క్రాఫ్ట్ చైర్మన్, ప్రముఖ మానసిక వైద్యులు డాక్టర్ కర్రి రామారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడ నుంచి గొలుసు అపహరణ

- ఇల్లు అద్దె కోసమని వచ్చి దురాగతం
- దర్యాప్తు చేస్తున్న పట్టణ పోలీసులు


వృద్ధురాలు అన్నపూర్ణ నుంచి వివరాలు సేకరిస్తున్న సీఐ వీర గంగాధర తిలక్, ఎస్సై శోభన్‌కుమార్

నిడదవోలు : ఇల్లు అద్దెకు కావాలని వచ్చిన ఇద్దరు యువకులు వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు తెంచుకుని ఉడాయించిన సంఘటన స్థానిక గాంధీనగర్ ఒకటో వీధిలో శనివారం చోటుచేసుకుంది. గాంధీనగర్ ఒకటో వీధిలో నూలి రామారావు, అన్నపూర్ణ వృద్ధ దంపతులు నివాసమంటున్నారు. నాలుగు రోజుల క్రితం ఓ యువకుడు ఇంటికి వచ్చాడు. అమలాపురంలో కొబ్బరి వ్యాపారం చేస్తున్నానని, కర్ణాటకలో మా బావగారు బ్యాంకులో పనిచేస్తున్నారని, నిడదవోలు బ్యాంకుకు వస్తున్నారని, ఇల్లు అద్దెకు కావాలని అన్నపూర్ణకు చెప్పాడు. ఆమె సరేనని చెప్పడంతో అతడు మళ్లీ వస్తానని చెప్పి వెళ్లిపోయాడు. శనివారం మధ్యాహ్నం ఒంటి గంటకు అతడు వచ్చి ఇల్లు అడగడంతో మరొకరికి ఇచ్చేశామని ఆమె బదులిచ్చింది. అయినా వినకుండా ఇల్లు చూస్తానని చెప్పడంతో ఆ బిల్డింగ్‌లో రెండో పోర్షన్ తాళాలను అతడికి ఇచ్చి అతడితో పాటు వెళ్లింది. వృద్ధురాలిని మాటల్లో పడేసి ఒక్కసారిగా ఆమె మెడలో ఉన్న ఏడు కాసుల బంగారు గొలుసులు తెంచుకుని అప్పటికే రోడ్డుపై బైక్ స్టార్ట్ చేసి సిద్ధంగా ఉన్న మరో యువకుడుతో ఉడాయించాడు. సీఐ వీర బాలగంగాధర్ తిలక్, పట్టణ ఎస్సై పి.శోభన్‌కుమార్ తన సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

మున్సిపల్ ఆదాయం పెంచాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీ నాగ నరసింహారావు

సామర్లకోట: మున్సిపాలిటీల ఆదాయంపై అధికారులు దృష్టి సారించాలని మున్సిపల్ ఆర్డీ నాగ నరసింహారావు అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో తుని, పిఠాపురం, గొల్లప్రోలు, ఏలేశ్వరం, పెద్దాపురం, సామర్లకోట మున్సిపాలిటీ, నగర పంచాయతీ అధికారులతో ఆయన సమీక్షించారు. ఇంటి, కుళాయి పన్నుల బకాయిలపై కనీసం నోటీసులు కూడా ఇవ్వకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. మున్సిపాలిటీల వారీగా సమీక్షిస్తూ ఏలేశ్వర నగర పంచాయతీలో ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, శానిటరీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని కమిషనర్ ఎం.సత్యనారాయణ తెలిపారు. సచివాలయ సిబ్బంది ఉపయోగించి బకాయిలు వసూలు చేయాలని ఆర్డీ ఆదేశించారు. నోటీసులు ఇచ్చినా స్పందించని వ్యాపార సంస్థల కుళాయి కనెక్షన్లు తొలగించాలని ఆదేశించారు. ప్రభుత్వ సంస్థలు మినహా మిగిలిన మొండి బకాయిల వసూలుపై శ్రద్ధ చూపాలని సూచించారు. అలాగే పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, స్వచ్ఛమైన తాగునీరు అందేలా చూడాలని, అక్రమ కట్టడాలపై దృష్టిపెట్టాలని, ప్రకటన బోర్డులను గుర్తించి వాటిపై ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తుని, పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోట, గొల్లప్రోలు, ఏలేశ్వరం కమిషనర్లు వెంకటేశ్వరరావు, కనకారావు, కేవీ పద్మావతి, ఎ.శ్రీవిద్య, రవి కుమార్, ఎం సత్యనారాయణ తదితర అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగాల కోసం 'వేదాంత' వద్ద నిరసన


ప్లాంటు అధికారులకు వినతి పత్రం అందిస్తున్న ఎస్.యానం గ్రామస్తులు

ఉప్పలగుప్తం: మండలంలోని ఎస్.యానం గ్రామంలో ఉన్న వేదాంత ప్లాంటు గేటు ఎదుట ఉద్యోగాల కల్పన కోరుతూ గ్రామస్తులు బైఠాయించి ఆందోళన చేపట్టారు. గతంలో టెక్నికల్, నాన్ టెక్నికల్ విభాగంలో 75 మంది స్థానిక యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్రజాప్రతినిధులు, ప్లాంటు అధికారులు, జిల్లా కలెక్టర్ సమక్షంలో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. రోజులు గడుస్తున్నా ప్లాంటు అధికారుల నుంచి స్పందన రాకపోవటం, అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన ఓఎన్‌జీసీ అధికారులు వారిని విస్మరించడంతో శుక్రవారం ప్లాంటు అధికారులకు వినతి పత్రం అందించేందుకు గ్రామస్తులు సంస్థ గేటు వద్దకు వెళ్లారు. అధికారుల స్పందించకపోవడంతో వారు అక్కడే బైఠాయించి ప్లాంటు కార్యకలాపాలను అడ్డుకున్నారు. మధ్యాహ్న భోజన సమయంలో సైతం సిబ్బందిని బయటకు రానివ్వకపోవటం, బయట నుంచి ప్లాంటు సిబ్బందికి భోజనాలు వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో అధికారులు దిగివచ్చి ఆందోళనకారులతో చర్చించారు. ప్లాంటు ఐఎం మైల్‌వేగస్, ఏవో సోమస్‌దేవ్‌కు గ్రామస్తులు వినతి పత్రం అందజేసి పది రోజుల్లో ఉద్యోగాలు కల్పించాలని కోరారు. గ్రామ సర్పంచ్ జోగి రాజరాజేశ్వరి, పెట్టా అప్పారావు, లంకే భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

బీసీ కుల గణన తక్షణం చేపట్టాలి

ఎమ్మెల్సీ కుడుపూడి డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కుడుపూడి, బీసీ సంఘాల నాయకులు

అమలాపురం టౌన్: రాష్ట్రంలో సమగ్ర బీసీ కుల గణన సర్వే తక్షణమే చేపట్టాలని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావుతో పాటు పలు బీసీ సంఘాల నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బీసీ కుల గణనకు ఆమోద ముద్ర వేసినప్పటికీ నేటికీ వెనుకబడడంపై బీసీ సంఘాల నేతలు నిరసన వ్యక్తం చేశారు. స్థానిక శెట్టిబలిజ గ్రంథాలయం వద్ద ఎమ్మెల్సీ కుడుపూడి అధ్యక్షతన శుక్రవారం జరిగిన బీసీ సంఘాల నేతల సమావేశం వచ్చే జనవరి లోపు బీసీ కుల గణన జరిగి తీరాలని, లేని పక్షంలో బీసీలంతా ఉద్యమం చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్సీ కుడుపూడి హెచ్చరించారు. బీసీలకు రాజ్యాంగ రక్షణ కావాలని, వారి డిమాండ్ నెరవేరాలంటే సర్వే చేపట్టాలని స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పలు బీసీ సంఘాల నాయకులు దండుమేను రూపేష్, భరణికాన బాబు, తాళాబత్తుల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడి అరెస్టు

- విద్యార్థినిని తల్లిదండ్రులకు అప్పగించిన అధికారులు

ప్రత్తిపాడు: మండలం రాచపల్లి గ్రామానికి చెందిన యువకుడిని పోలీసులు శుక్రవారం పోక్సో కేసులో అరెస్టు చేశారు. నిందితుడు తన వెంట తీసుకుపోయిన బాలికను ఆమె తల్లిదండ్రులను అప్పగించారు. ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు తెలిపిన వివరాల మేరకు రాచపల్లి గ్రామానికి చెందిన బాలిక ఇదే మండలంలోని ఒమ్మంగిలో ఒక ప్రైవేటు పాఠశాలకు నిత్యం ఒక ఆటోలో వెళ్లి వస్తూ చదువుకుంటోంది. ఈ నెల 30న పాఠశాలకు వెళ్లిన ఆమె అదృశ్యమైంది. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఎస్.లక్ష్మీకాంతం కేసు నమోదు చేసి ఆటో డ్రైవర్ పెదిరెడ్డి కృపారాజుపై అనుమానించి దర్యాప్తు చేశారు. కృపారాజు తన కూతురు, కొడుకుతో పాటు సదరు విద్యార్థినిని ప్రేమిస్తున్నా.. పెళ్లి చేసుకుంటానని నమ్మించి తీసుకుపోయాడు. అనంతరం ఆమెను ధర్మవరం, కాకినాడ, రాజమహేంద్రవరం, భీమవరం తదితర గ్రామాల్లో తిప్పుడూ లైంగిక అవసరాలు తీర్చుకున్నాడు. అనంతరం శుక్రవారం ఆమె రాచపల్లి తల్లిదండ్రుల వద్దకు చేరుకుంది. అనంతరం ఆమెను స్థానిక తహసీల్దార్ ఎం.సూర్యప్రభ వద్ద హాజరుపరిచి, తల్లిదండ్రులను అప్పగించారు. ధర్మవరం గ్రామ శివారులో నిందితుడు ఆటోడ్రైవర్ పెద్దిరెడ్డి కృపారాజును అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు.